ప్రజాశక్తి
ఆదివారం 2 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం



సోషల్ మీడియాలో పోస్టులకు అడ్మిన్లదే బాధ్యత

ప్రజాశక్తి-పాలకొండ

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలు, వాట్సాప్ గ్రూపుల్లో ఎలాంటి విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్ట్ చేసినా ఆయా గ్రూపుల అడ్మిన్లే పూర్తి బాధ్యత వహించాలని పాలకొండ డిఎస్‌పి జి.వి.కృష్ణారావు హెచ్చరించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా అడ్మిన్లు కూడా బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన ప్రతిఒక్కరిపైనా చర్యలు తీసుకుంటామని సోషల్ మీడియా అడ్మిన్లకు సూచించారు.

కాకరేపుతున్న పోస్టల్ బ్యాలెట్

సార్వత్రిక ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థుల్లో ఆందోళన ఉత్కంఠ పెరుగుతోంది. గెలుపు ఓటములపై లెక్కలు వేసుకోవడంలో తలమునకలయ్యారు. హోరాహోరీ పోటీ నెలకొన్న ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అత్యంత కీలకం కానున్నాయి. ఈవిఎంల ద్వారా పడిన ఓట్ల కంటే ఉద్యోగ,ఉపాధ్యాయులు వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లే నేడు చర్చనీయాంశమవు తున్నాయి. ప్రభుత్వంపై ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం ఉందని, అధిక శాతం ఓట్లు తమకే పడతాయని టిడిపి అంచనాలు వేస్తోంది. తమకూ ఉద్యోగులు ఓటేశారని వైసిపి నమ్ముతోంది. 2019 ఎన్నికల్లో మాత్రం వైసిపికే అధిక శాతం ఓట్లు పోలయ్యాయి.

- గత ఎన్నికల్లో వైసిపికే అధిక శాతం ఓట్లు
- ఉద్యోగులు ఈసారి ఎవరిని కరుణించేనో?

2024 ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

విజయనగరం	4201
రాజాం	2116
బొబ్బిలి	2433
చీపురుపల్లి	1496
గజపతినగరం	2089
నెల్లిమర్ల	1759
విజయనగరం	4201
శృంగవరపుకోట	2005
పార్వతీపురం	2091
కురుపాం	2446
సాలూరు	1467
పాలకొండ	1796



ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 11 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, సగానికి పైగా అసెంబ్లీ స్థానాల గెలుపు ఓటములపై పోస్టల్ బ్యాలెట్ ఓట్లే తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. విజయనగరం జిల్లాలో 18,631 మంది ఓటర్లకు గాను 16,469 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 370 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. మన్యంలో 6,812 మంది పోస్టల్‌బ్యాలెట్‌కు దరఖాస్తు చేయగా, 8907 ఓట్లు పోలయ్యాయి. అయితే ఎన్నికల డ్యూటీ పడిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేయకపోయినా ఓటు వేయవచ్చనే నిబంధనతో పోలింగ్ ఎక్కువగా జరిగింది.

నువ్వా..నేనా అంటూ పోటీ పడిన టిడిపి, వైసిపి అభ్యర్థులకు పడిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లే అత్యంత కీలకంగా మారాయి. జూన్ 4న వారి తలరాతను మార్చే స్థాయిలో పోల్ కావడం గమనార్హం. ఎన్నికల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అత్యధికంగా పోలయ్యాయి. ఇప్పుడే ఈ ఓట్లే అధికార వైసిపి అభ్యర్థుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. తమకు ఏమాత్రం ఓట్లు పడ్డాయోనన్న ఆందోళనతో ఉన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో సిఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించారు. విధి నిర్వహణలో తీవ్ర పని ఒత్తిడే కాకుండా వారికి దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనాలపై కోలుకోలేని దెబ్బ కొట్టారు. ఫలితంగా వైసిపి పాలనపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఈ అసంతృప్తి పోలింగ్ సందర్భంగా ఉద్యోగుల్లో కనిపించింది. పెద్దఎత్తున పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు కారణమైంది.

మెరుగైన పిఆర్‌సి, డిఎల చెల్లింపు,సిపిఎస్ రద్దు వంటి కీలక హామీలను నెరవేరుస్తామంటూ జగన్ చెప్పిన మాటలు నమ్మిన ఉద్యోగులు గత ఎన్నికల్లో వైసిపికే ఎక్కువగా ఓట్లు వేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను నెరవేర్చకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులను తీవ్రంగా అణచివేశారు. వారిలో గూడుకట్టుకున్న ఆవేశం, అసంతృప్తి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రోజున వెల్లగక్కినట్లు తెలుస్తోంది. స్వల్పమెజార్టీతో ఓడిపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులే కారణమన్న చర్చ జరుగుతోంది.

2019 ఎన్నికల్లో ఇలా..

2019 ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 14,269 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేయగా, అందులో 7,145 ఓట్లు వైసిపికి, 4,358 ఓట్లు టిడిపికి పడ్డాయి. మరో 2,740 ఓట్లు చెల్లకపోవడంతో తిరస్కరణకు గురయ్యాయి. 130 ఓట్లు నోటాకు పడ్డాయి.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	వైసిపి	టిడిపి	చెల్లనవి	నోటా
విజయనగరం	2,628	1,304	496	691	10
ఎస్.కోట	1,281	616	515	127	03
గజపతినగరం	1,507	868	400	104	06
బొబ్బిలి	1,942	1070	761	571	00
నెల్లిమర్ల	1,112	669	263	332	00
చీపురుపల్లి	1,141	669	208	214	00
పార్వతీపురం	1,643	444	1081	08	06
సాలూరు	1,502	814	316	291	103
కురుపాం	1,513	664	318	402	01



ఉచిత మీటర్‌ను పరిశీలిస్తున్న సిఎండి పృథ్వీతేజ్


మీటర్లు ఎలా పనిచేస్తున్నాయి?

ఇంటింటికీ వెళ్లి ఉచిత మీటర్లను పరిశీలించిన సిఎండి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండలంలో ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత మీటర్లు ఏ విధంగా పనిచేస్తున్నాయని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మాది తనిఖీ చేపట్టారు. శనివారం మండలంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. విద్యుత్తు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మండలంలో రాయిమానుగూడ, లక్కాయిగూడ, దేవనాపురం, కుసిమి గ్రామాలను సందర్శించారు. లబ్ధిదారులకు ఉచిత మీటర్లు అందాయా? లేదా? అడిగి తెలుసుకున్నారు. ఎలా పనిచేస్తున్నాయని ఆరాతీశారు. వినియోగదారుల సమస్యలు వీలైనంతవరకు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

కార్యక్రమంలో డైరెక్టర్ సూర్య ప్రతాప్, ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం, ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి, డిఇ గోపాలకృష్ణ, ఎఇ జి.నీలిమ, తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టం.. ఎస్‌బిఐ సేవా కేంద్రం వద్ద బారులు తీరిన పింఛనుదారులు

పింఛను కోసం పాట్లు

ప్రజాశక్తి-వీరఘట్టం

పింఛను కోసం మరోసారి లబ్ధిదారులు పడరాని పాట్లు పడ్డారు. మండలంలో 9966 మందికి వృద్ధాప్య, వితంతు, కల్లుగీత, వికలాంగ, ఒంటరి మహిళ తదితర పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. వీరిలో 2158 మంది పింఛనుదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ సుబ్రమణ్యం తెలిపారు. మిగతా వారికి గత నెల మాదిరిగానే బ్యాంకు ఖాతాల్లో పింఛన్లు జమచేశారు. దీంతో శనివారం బ్యాంకులు కిటకిటలాడాయి. ఎస్‌బిఐ సేవా కేంద్రాల వద్ద పింఛనుదారులు బారులు తీరారు. ఎండతో గంటల తరబడి క్యూలో నిలబడి తీవ్ర అవస్థలు పడ్డారు.

ఇన్‌ఛార్జి ఎపిఒగా గణేష్

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ ఇన్‌ఛార్జి ఎపిఒగా పిహెచ్ఒ గణేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐటిడిఎ అందిస్తున్న పథకాలు గిరిజనులకు అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు పిఎఒ హరికృష్ణ, డిప్యూటీ డిఇఒ పి.నారాయడు, సబస్టెంట్ కె.కాంతారావు, ఎఎంఒ పి.కోటిబాబు శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన ఎపిఒ గణేష్

సరిపడా విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి-కొమరాడ

రైతులకు సరిపడా వరి విత్తనాలు పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి విత్తనాలు ప్రతి ఏడాది రైతులకు సరిపడా ఇవ్వకపోవడంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలకు 1064, 1121, ఆర్‌జిఎల్ రకం విత్తనాలు తప్ప సాంబమసూరి, సోనా మసూరి విత్తనాలు రావడం లేదని చెప్పారు. ఎకరానికి బస్తా చొప్పున వరి విత్తనాలు అందిస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిబంధనలతో సంబంధం లేకుండా రైతులకు సరిపడా విత్తనాలు అందించాలని డిమాండ్‌చేశారు.

4న మద్యం దుకాణాలు మూసివేత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీన జిల్లాలో మద్యం షాపులన్నిటినీ మూసివేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ మద్యం దుఖాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, సంకిలిలోని డినేచర్డ్ ఇథనాల్ యూనిట్, డినేచర్డ్ స్పిరిట్ మొలాసిస్ యూనిట్స్, మెథనాల్ యూనిట్లు, కల్లు దుఖాణాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటలు నుంచి 4వ తేదీ మంగళవారం రోజంతా వీటన్నిటినీ మూసివేస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షిపాతంగా నిర్వహించేందుకు ఈ డ్రైడే నిబంధనలను పాటించాలని ప్రకటనలో కోరారు. డ్రైడే రోజు మద్యం సేవించడం, కలిగి ఉండం, తాగడం నేరమని, దానిని అతిక్రమించినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

నేడు ఎల్‌టిపిల సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్థానిక బైపాస్ రోడ్‌లోని ప్రయివేటు హోటల్లో ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పిన్నింటి జయకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నాయకులు పి.మురళీకృష్ణ, సిహెచ్ శ్రీనివాస్ కుమార్, కె.విజయ రామకృష్ణ, ఎన్.దేవేంద్ర ప్రసాద్ హాజరవుతారని చెప్పారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి, జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

ఒకపూటే పనులు పెట్టాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు
- ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఉపాధి హామీ పనులు ఒకపూట మాత్రమే నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పని ప్రాంతాల్లో నీడ, నీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. వేసవి అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. వ్యవసాయ పనులు దొరకనందున 200 రోజులు పని కల్పించాలని కోరారు. పెరిగిన ధరల వల్ల రోజు కూలి రూ.600 ఇవ్వాలని కోరారు. ఈ మేరకు శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాముతో కలిసి పార్వతీపురం మండలంలో పనసభద్ర, తొక్కుడువలసలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిధులు తగ్గిస్తూ నీరుగార్చాలని కుట్ర చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీతో గామాల్లో వ్యవసాయ కూలీల కుటుంబాల్లో వలసలు ఆగాయని చెప్పారు. కూలీలు భరోసాతో బతుకుతున్న సందర్భంలో ఇటువంటి చట్టాన్ని నిర్వీర్యం చేసి ఎత్తేయడానికి మోడీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఉపాధి హామీలో రెండు పూటలా పనిపెట్టి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గతేడాది రూ.90 వేల కోట్లు ఉపాధి హామీ పనుల కోసం బడ్జెట్‌లో కేటాయిస్తే, ఈ సంవత్సరం నిధులు తగ్గించి రూ.60 వేల కోట్లు కేటాయించారని చెప్పారు. పారలు, గునపాలు, తట్టలకు డబ్బులు కూలీల ఖాతాలో వెయ్యడం లేదన్నారు. టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు, మజ్జిగ సరఫరా చేసేవారని, ప్రస్తుతం అవేవీ చేయడం లేదని తెలిపారు. ఇలాంటి సందర్భంలో వీటి డబ్బులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. పనిప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్‌చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరసన్న, చిరంజీవి, రాములు, రామమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

కొమరాడ : ఏడాదికి 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శివనాయుడు డిమాండ్ చేశారు. మండలంలో ఉపాధి పనులను సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తులసీరామ్

జీతాల బకాయిలు చెల్లించాలి

ఎపిపిటిడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తులసీరామ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి విజయనగరం జోనల్ వర్క్ షాప్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఎపిపిటిడి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.జగన్ మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేరుకు ప్రభుత్వ సంస్థ అయినా సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, ఏప్రిల్ వేతనం నేటికీ చెల్లించకపోతే కార్మికులు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. సర్కులర్ ప్రకారం స్కిల్, సెమిస్కిల్, ఆన్ స్కిల్డ్ జీతాలు 6 నెలలకు ఒకసారి పెరిగే డిఎ కలిపి చెల్లించాలని, రాష్ట్రంలో ఒక్క చోటైనా ఆ విధంగా చెల్లించడం లేదని తెలిపారు. అటువంటి కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవలసిన వర్క్ మేనేజర్లు, డిపిటిఒలు, డిఎంలు సకాలంలో జీతాలు చెల్లించమని అడుగుతున్న కార్మికులపై ఎదురుదాడికి దిగుతున్నారని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. విజయనగరం జోనల్ వర్క్ షాప్ వర్క్ మేనేజర్ తక్షణమే కలుగజేసుకుని ఇక్కడ కార్మికులకు ఏప్రిల్ మే నెల వేతనాలు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టర్ కాలపరిమితి ముగిసినందున అనేశ్వర సంస్థ నుంచి కార్మికులకు రావలసిన బకాయిలన్నీ ఇప్పించాలన్నారు. ప్రతి ఆరు నెలలకు పెరిగే డిఎ సర్క్యులర్ ను నోటీసు బోర్డులో పెట్టాలని,కార్మిక శాఖ ప్రకటించిన సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు ఆర్‌టిసి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్‌జైల్‌ను సందర్శించిన జిల్లా జడ్జి

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ సబ్‌జైల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహమ్మద్ మౌలానా శనివారం సందర్శించారు. సబ్‌జైల్ పరిసరాలను పరిశీలించారు. సబ్ జైల్లో ముద్దాయిలతో మాట్లాడి, వారి యోగాక్షేమాలను, వైద్య సదుపాయాలను, పరిశుభ్రతను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి విజయ రాజ్ కుమార్, న్యాయవాదులు మునుస్వామి, రామ్మోహన్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బుక్‌స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

ఎపి మోడల్ స్కూల్‌లోని మండల బుక్ స్టాక్ పాయింట్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ శనివారం ఆకస్మిక సందర్శించారు. ఇప్పటి వరకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు, పెండింగ్‌లో ఉన్న వివరాలు సిఆర్‌పిలను అడిగి తెలుసుకున్నారు. ఫేజ్-1లో ఒకటి, రెండు తరగతులు, ఎనిమిదో తరగతి పుస్తకాలు వచ్చాయని, ఐదో తేదికి అన్ని పుస్తకాలు చేరుకుంటాయని తెలిపారు. పాఠశాల ప్రారంభం రోజున విద్యా కానుక, పుస్తకాలు పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఎపి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ రామలక్ష్మి, ఆంగ్ల ఉపాధ్యాయులు మధ్య నెలకొన్న వివాదంపై విచారణ చేపట్టారు. అందరూ సమన్వయంతో నడుచుకోవాలని, ఆదర్శంగా ఉండాల్సిన ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఇలా ప్రవర్తిస్తుండటం సరికాదని సర్దిచెప్పారు.

కంచే చేను మేస్తే..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో అసైన్డ్ భూముల దోపిడీ వ్యవహారం కంచే చేను మేసేసినట్టుగా ఉంది. పెద్దలకు అధికార యంత్రాంగం సహకరించడం, భూములిచ్చేందుకు ముందుకు రానివారిపై పోలీసులు బెదిరింపు చర్యలకు పూనుకోవడం వంటివి యథేచ్ఛగా సాగుతున్నాయట. దీంతో, భూదోపిడీదారుల ఆగడాలకు అడ్డేలేకుండా పోయిందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేదో ప్రతిపక్ష పార్టీ నాయకులో లేక, కొందరు వ్యక్తులో చేస్తున్న ఆరోపణలు కాదు సుమా...! కొద్దిరోజులుగా జిల్లాలో హాట్‌హాట్‌గా సాగుతున్న పబ్లిక్ టాక్. ప్రభుత్వం తీసుకొచ్చిన 9/23 ఆర్డినెన్స్ ప్రకారం సాగుదారులకు దఖలు పర్చాల్సిన భూమిని కొంతమంది పెద్దలు అడ్డగోలుగా వశపర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం రూ.కోట్ల విలువైన భూములకు రూ.లక్షలు చేతిలోపెట్టి భూములు రాయించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం తనకు పట్టనట్టుగా, తెలియనట్టుగా ఉండడంపై జనం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారమంతా అధికారుల కనుసన్నల్లో వారి అండదండలతోనే సాగుతోందని కూడా జనం చర్చించుకుంటున్నారు.

ముఖ్యంగా పూసపాటిరేగ మండలం కందివలస, చోడమ్మ అగ్రహారం, కనిమెట్ట రెవెన్యూ గ్రామాల పరిధిలో 200 ఎకరాలు దళితులు, ఇతర సామాజిక వర్గాలకు చెందిన పేదల సాగులో ఉన్నాయి. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ ప్రాంతంలోని భూమి విలువ ఎకరా సుమారు రూ.1కోటి నుంచి రూ.కోటి 30లక్షల వరకు పలుకుతోంది. దీంతో, ఈభూమిపై ల్యాండ్ మాఫియా కళ్లు పడ్డాయి. రాజకీయ నేతల బినామీలు గ్రామాల్లోకి వచ్చి ఎకరాకు రూ.20లక్షల చొప్పున బేరం కుదుర్చుకుని అక్కడి పరిస్థితిని బట్టి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అడ్వాన్సులు ఇచ్చారు. ఇదే మండలంలోని కొవ్వాడ, కోనాడ, బత్తివలసతోపాటు భోగాపురంలోని పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. గంట్యాడ మండలం పెద మధుపాడ రెవెన్యూ పరిధిలో 150 ఎకరాల్లో 200 మంది దళితులు, ఇతర పేద సామాజికవర్గాలు సాగు చేస్తున్న 150 ఎకరాలపైనా పెద్దల కల్లుపడ్డాయి. ఎలాగైనా తమకు విక్రయించాలంటూ ఒత్తిడి చేస్తున్నారట. కొత్తవలస, వేపాడ, బొబ్బిలి తదితర మండలాల్లో కూడా ఇదేరకమైన దోపిడీ జరుగుతోంది.



దాదాపు అన్నిచోట్లా అసైన్డ్ పట్టాదారులకు దోపిడీదారులు మాయమాటలు చెప్పి మాటలు చెప్పి బురిడీకొట్టిస్తున్నారట. '20ఏళ్లు దాటి సాగులోవున్న అసైన్డ్ భూములకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తున్నమాట వాస్తవమే. కానీ, మీ భూములకు అందుకు తగిన రికార్డులు ఉన్నాయో లేవో. బహుశా అందుకే మీ పేర్లు అధికారులు వెల్లడించలేదు. పేర్లు లేనప్పుడు మీకు పట్టాలు ఎలా వస్తాయి. అంటూ నమ్మబలకుతున్నారని గ్రామాల్లో జనం చర్చించుకుంటున్నారు.

వాస్తవానికి ఆర్డినెన్స్ ద్వారా పట్టాల పంపిణీకి గ్రామాల వారీగా అసైన్డ్ భూమి సాగుదారులు ఎవరు? వారికి ఏ సంవత్సరంలో ప్రభుత్వం అప్పగించింది? ముఖ్యంగా 2003కు మునుపు ఇచ్చిన భూమి ఎంత? వాటిని అసైన్డ్ పట్టాదారులే సాగు చేస్తున్నారా? లేక వారి వారసులు సాగు చేస్తున్నారా? అప్పట్లో ఇచ్చిన భూమంతా వీరిచేతిలోనే ఉందా? లేక ఇతరులెవరైనా సాగు చేస్తున్నారా? అన్న కోణంలో గత ఏడాది అక్టోబరులోనే భూమి వివరాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం. ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే ఆ పెద్దల ఒత్తిడితో అసైన్డ్ ల్యాండ్, అందులోని ఫ్రీహోల్డ్ చేసిన భూముల వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారని జనం అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో, వేలాది మంది దళితులు, పేదలు మోసపోతున్నారనే చర్చ సాగుతోంది.



యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

జిందాల్ యాజమాన్యంతో ఎమ్మెల్యే చర్చలు

ప్రజాశక్తి - కొత్తవలస

అప్పన్నపాలెం వద్ద జిందాల్ కర్మాగారం లేఆఫ్ ప్రకటించడంపై ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు జిందాల్ యాజమాన్యంతో శనివారం చర్చించారు. ఈ చర్చిల్లో జిందాల్ యాజమాన్యం నుంచి జిఎం దినేష్ శర్మ, డిజిఎం గోపాలకృష్ణ పాల్గొనగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర కొప్పుల వల్ల కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, ఎల్ కోట ఎంపిపి గేదెల శ్రీనివాస్, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చల్లో యాజమాన్యం మాట్లాడుతూ కంపెనీ తిప్పడం తమ చేతిలో లేదని, టాప్ మేనేజ్మెంట్ చేతిలో ఉందని తేల్చి చెప్పారు. పర్మినెంట్ కార్మికులకు మూడు నెలలు లే ఆఫ్ ఇస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వస్తుందని వచ్చిన వెంటనే సిఎం జగన్మోహన్ రెడ్డితో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అంతవరకు కార్మికులు సమయమనం పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు నమ్మి చినబాబు, పిల్ల అప్పలరాజు, లగుడు వామాలు, పెదరెడ్ల ప్రసాదు, బొట్ట రాము, సలాది భీమయ్య, బాలిబోయిన ఈశ్వరరావు, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



జెసిబితో చదును చేస్తున్న అక్రమార్కులు

చెరువు కబ్జాకు యత్నం

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని మిలటరీ కాలనీ సమీపంలో ఉన్న చెరువును కబ్జా చేసేందుకు చేపల వ్యాపారి ప్రయత్నించగా రెవెన్యూ ఉద్యోగులు అడ్డుకున్నారు. మిలటరీ కాలనీ సమీపంలో సుమారు రెండెకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న చెరువును కబ్జా చేసేందుకు పట్టణానికి చెందిన చేపల వ్యాపారి ప్రయత్నించి ప్రొక్లెయిన్‌తో చదును చేయడం ప్రారంభిం చారు. చెరువును కబ్జా చేటున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి తెలియడంతో మల్లమ్మపేట, ఇందిరమ్మ కాలనీ విఆర్‌ఒ శ్రీనివాసరావు, లలితను చెరువు వద్దకు పంపించి కబ్జాను అడ్డుకున్నారు. చెరువును చదును చేస్తున్న ప్రొక్లెయిన్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. చెరువులను అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

చెరువు కబ్జాపై చర్యలు తీసుకోవాలి

చెరువు కబ్జాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట అప్పన్న వేర్వేరుగా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెరువులను ఆక్రమణ చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎరువుల షాపుల డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వ్యవసాయ శాఖ ఎడి రత్నకుమారి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. షాపుల వద్ద ధరల పట్టిక కచ్చితంగా ఉంచాలని, స్టాకు వివరాలు కూడా పట్టికలో పొందుపరచాలన్నారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయాలు చేపడితే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండలంలోని 24 రైతు భరోసా కేంద్రాల్లో ఎంటియు-1064, 1121, ఆర్‌జిఎల్ విత్తనాలు అందుబాటులోకి వచ్చినట్లు ఎడి తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఒ జె.సౌజన్య, డీలర్లు పాల్గొన్నారు.

అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

అనుమతులు లేని నిర్మాణాలు, లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని గొల్లవీధి, అప్పయ్యపేట వద్ద ఉన్న లేఅవుట్లను, విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న అపార్ట్‌మెంట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసిన, నిర్మాణాలు చేపట్టిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. లేఅవుట్లకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

శ్రీచైతన్య కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

బొబ్బిలి: భవనం లేకుండా ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్న శ్రీచైతన్య కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మణికుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు యాజమాన్యం అనుమతులు తీసుకుని భవనం లేకుండా అడ్మిషన్లు చేస్తున్నారని విమర్శించారు. నూతన భవనం నిర్మాణంలో ఉంటే విద్యార్థుల నుంచి అడ్మిషన్లు చేయడం దుర్మార్గమన్నారు. భవనం లేకుండా అడ్మిషన్లు చేస్తున్న కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని గుర్తింపు రద్దు చేయాలని కోరారు. లేనిచో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హనుమాన్ జయంతి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీరఘట్టంతోపాటు కడకల్లా, కంబరవలస, నడుకూరు, తలవరం గ్రామాల్లో హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

సీతానగరం : మండలంలోని పలు గ్రామాలలో హనుమాన్ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం మార్కెట్లో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు మమ్ముల విశ్వేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, కె.లక్ష్మణరావు, ఎ.గోవింద్, ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

ప్రజాశక్తి -గరుగుబిల్లి

స్థానిక షిరిడి సాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం లక్ష పుష్పార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధరాఘాతం



- చుక్కల్లో నిత్యావసర ధరలు
- ముట్టుకోనివ్వని మాంసం ధరలు
- భారమవుతున్న సామాన్యుల బతుకులు

'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినట ట్లేదు..' కొండెక్కిన కూరగాయ ధరలు, చుక్కలు చూపిస్తున్న నిత్యావసర ధరలు, ముట్టుకోనివ్వని మాంసం ధరలు సామాన్యుడి జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా రోజురోజుకూ ధరలు పెరుగుతుండడంతో సామాన్యుని బతుకు భారమవుతోంది. ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలమయ్యాయనే ఆరోపణలున్నాయి. గతేడాది వర్షపాతం తగ్గడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. వర్షాభావంతో పంటల దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో నిత్యావసర, కూరగాయల ధరలు గణనీయంగా పెరగడానికి కారణమయ్యాయి. ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరఫరా చేసి సామాన్యులపై ఉన్న భారాన్ని తగ్గించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

- ప్రజాశక్తి, కురుపాం

కొండెక్కిన కూరగాయలు

కూరగాయల మార్కెట్లో ఒకటి రెండు తప్ప. మిగతా అన్ని కిలో రూ.80పైనే పలుకుతున్నాయి. టమాటా, వంకాయ మాత్రమే కిలో రూ.40 లోపు ఉన్నాయి. బెండకాయ, దొండకాయ, చిక్కుడు, బీరకాయ, గోరుచిక్కుడు, క్యాప్సికం రేట్లు కిలో రూ.80పైనే ఉన్నాయి. రూ.5కు దొరికే మునక్కాయ ఇప్పుడు రూ.10 అయింది. ఎండాకాలంలో కూరగాయల ఇలా రేట్లు పెరగడంతో జనం అల్లాడుతున్నారు.

చుక్కలు చూపిస్తున్న నిత్యావసర ధరలు

ఇదిలా ఉండగా నిత్యవసర వస్తువుల ధరలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. కందిపప్పు, పెసరపప్పు మొన్నటి వరకు కిలో రూ.110 వరకు ఉండగా ప్రస్తుతం రూ.180కి చేరాయి. నువ్వులు కిలో రూ.200 దాటాయి. మినపప్పు కిలో రూ.140 నుంచి రూ.180 వరకు వెళ్లింది. నూనె రేట్లు కిలో రూ.160కి తక్కువ లేవు. కంపెనీ నూనె రూ.190 పలుకుతోంది. సన్ఫవర్ నూనె రేట్లు రూ.115 నుంచి రూ.120, పామాయిల్ రేట్లు రూ.90 నుంచి రూ.100 వరకు ఉన్నాయి. ఇక అల్లం కిలో రూ.200 దాటగా, తెల్లఉల్లి కిలో రూ.200 దాకా అమ్ముతున్నారు. ఏడాది కిందట క్వింటాల్ బియ్యం రూ.4,500 నుంచి రూ.5వేల మధ్య ఉండగా ఇప్పుడు రూ.6 వేల నుంచి రూ.7 వేలకు అమ్ముతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బియ్యం రేట్లను సగటున రూ.600 నుంచి రూ.800 దాకా పెంచేశారు. పాత రకాలను రూ.7,200 నుంచి రూ.7,400 దాకా అమ్ముతున్నారు. బియ్యం రేట్లను వ్యాపారులు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు. గతంలో బియ్యం రేట్లపై ప్రభుత్వం నియంత్రణ ఉండేది. మిల్లులకు, మన అవసరాలకు మించి స్టాక్ ఉన్నప్పుడే ఎగుమతులకు అనుమతులు ఇచ్చేవారు. బియ్యం రేట్ల నియంత్రణ చేయడంలో ప్రభుత్వం విఫలమైనందున మిల్లర్లంతా సిండికేట్‌గా మారి, ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భగ్గుమంటున్న మాంసం ధరలు

కూరగాయల ధరలతోపాటు మాంసం ధరలు భారీగా పెరిగాయి. కిలో మటన్ రూ.800, చికెన్ గతంలో రూ.180 ఉండేది. ఇప్పుడు రూ.240, స్కిన్ లెస్ చికెన్ రూ.300 అమ్ముతున్నారు. కోడిగుడ్డు రేటు కూడా రూ.5 నుంచి రూ.7కు చేరింది. కూరగాయల రేటుతో పాటు మాంసం రేట్లు కూడా పెరగడంతో ఏం తినాలో అర్థం కాని పరిస్థితుల్లో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు.

జీతం సరిపోవడం లేదు

కూరగాయలు, నిత్యవసర సరుకులు, మాంసం ధరలు అమాంతంగా పెరగడంతో వచ్చే జీతం సరిపోవడం లేదు. నెలకు రూ.12వేలు జీతం వస్తే సరుకులకే సరిపోతుంది. ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తోంది.

- బి. గోపాల్ , చిరుద్యోగి, రస్తాకుంటుబాయి

అప్పు చేయక తప్పడం లేదు

కూరగాయల ధరలు విపరీతంగా పెరగడం వల్ల మార్కెట్‌కు పోతే రూ.600 అవుతోంది. నిత్యవసర ధరలు పెరగడం, దీనికి తోడు ఎండాకాలం కావడంతో కూలి పనులు కూడా లేవు. జీవనం సాగించడానికి అప్పు చేయక తప్పడంలేదు..

- జి. భవాని, వ్యవసాయ కూలీ, గొత్తిలి

పచ్చళ్లతో సర్దుకుపోతున్నాం

ధరలు పెరగడం వల్ల కూరగాయలు కొనలేక పచ్చళ్లతో సర్దుకుపోవాల్సి వస్తోంది. వచ్చే ఆదాయంలో నిత్యవసర వస్తువులు కొనే పరిస్థితి లేదు. బతకడానికి కావాల్సిన వస్తువులు మాత్రమే మార్కెట్ నుంచి తెచ్చుకుంటున్నాం.

- దేవి, గృహిణి, నీలకంఠపురం

పట్టాలు లేవని పరిహారం ఇవ్వలేదు

- ఇష్టానుసారంగా తోటలు ధ్వంసం చేస్తే ఎలా? ● ఆవేదన వ్యక్తం చేసిన రీసుపేట, బసవపాలెం గ్రామస్తులు ● చెట్ల తొలగింపు అడ్డగింత

ప్రజాశక్తి భోగాపురం

భూములకు పట్టాలు లేవని పరిహారం ఇవ్వకుండా ఏళ్ళ తరబడి ఏపుగా పెంచుకున్న జీడి తోటలను జిఎంఆర్ సంస్థ సిబ్బంది ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తున్నారని మండలంలోని తూడెం పంచాయతీ రీసుపేట, బసవ-పాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కూడా తమ పరిహారం విషయంలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిఎంఆర్ సంస్థ తమ భూముల్లో చేపడుతున్న చెట్ల తొలగింపును శనివారం రైతులు అడ్డుకున్నారు. బసవపాలెం రెవెన్యూ పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయం సెక్యూరిటీ విభాగమైన సెంట్రల్ ఇండ్రస్టీరియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సి.ఐ.ఎస్.ఎఫ్) సిబ్బంది ఉండేందుకు నివాస గృహాలు నిర్మించనున్నారు. ఇందుకోసం సర్వే నెంబరు 25లో 25ఎకరాలు ప్రభుత్వ భూమిని సేకరించారు. ఇందులో డీపట్టా మూడున్నర ఎకరాలు కూడా ఉంది. పట్టాలు ఉన్నందున ఆభూమికి ఎకరాకి రూ.53 లక్షలు నష్ట పరిహారం ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. మిగతా 22 ఎకరాల భూములకు పరిహారం ఊసెత్తలేదు. ఈ భూములు కూడా రైతుల ఆదీనంలోనే ఉన్నా పరిహారం ఇవ్వడానికి ముందుకు రాలేదు. దీంతో తమ తాత తండ్రలు నుంచి ఏళ్ళ తరబడి సాగు చేసుకుంటున్న తమ భూములకు రూపాయి కూడా పరిహారం ఇవ్వకపోవడం దారుణమని సుమారు 40 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తమ పొలంలో చెట్లను తొలగించొద్దంటూ అడ్డుపడుతున్న ఒక కుటుంబం

అడ్డుకున్నా జెసిబితెఓ జీడితోట్ల తొలగింపు

ఈ భూముల్లో రైతులు పెంచుకున్న జీడితోటలను గత రెండు రోజులు నుంచి జిఎంఆర్ సంస్థ సిబ్బంది జెసిబిలతో పాటు రంపం మిషన్లతో తొలగిస్తున్నారు. రైతులు అడ్డుకుంటున్నప్పటికీ రైతులను పక్కకు తోసేసి మరీ దౌర్జన్యంగా తొలగిస్తున్నార రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు మాత్రం చెట్ల దగ్గరకు జెసిబిలు రాకుండా అడ్డంగా నిలబడి అడ్డుకున్నారు. మరి కొంతమంది రైతులు అందుబాటులో లేకపోవడంతో వారి తోటల్లో చెట్లను తొలగించారు. ఒక మాజీ ఆర్మీ అధికారి తన భూమికి సంబంధించిన పేపర్లు ఉన్నాయని చెప్పడంతో తహశీల్దారు కార్యాలయానికి వెళ్ళి చూపించాలని అక్కడ ఉన్న అధికారులు సూచించారు.

మహిళలమని చూడకుండా దౌర్జన్యం చేస్తున్నారు

ఎన్నో ఏళ్ళ నుంచి ఈ భూముల్లో మేమంతా సాగు చేసుకుంటున్నాం. రూపాయి నష్ట పరిహారం ఇవ్వకుండా ఎప్పటి నుంచో పెంచిన జీడి చెట్లను నరికేస్తున్నారు. అడ్డుపడితే జిఎంఆర్ సంస్థ సిబ్బంది మహిళలమని చూడకుండా దౌర్జన్యం చేస్తున్నారు. నా భూజంపై చేయివేసి మరి తోసేశారు. ఇది చాలా దారుణం. మమ్మల్ని నాయకులు, అధికారులు ఆదుకొని నష్టపరిహారం ఇప్పిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నాం.

రీసు పాప, మహిళా రైతు, బసవపాలెం.





జెసిబితో చెట్లను తొలగిస్తున్న జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు

నిరాడంబరంగా రాజన్నదొర జన్మదినం

ప్రజాశక్తి-సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొర జన్మదిన వేడుకలు శనివారం నిరాడంబరంగా జరిగాయి. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉండటంతో శుభాకాంక్షలు చెప్పడానికి ఎవరూ రావొద్దని ఆయన కోరారు. అయినప్పటికీ నియోజకవర్గంలో నాలుగు మండలాలతోపాటు పట్టణ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి తరలివచ్చారు. పట్టణంలోని శ్రీరామాకాలనీలో హనుమాన్ జయంతి సందర్భంగా రాజన్నదొర కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనాలకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అర్బన్ బ్యాంకు అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు, పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ,పట్టణ నాయకులు గొర్లి మధుసూదనరావు, గిరి చిన్నిదొర, రౌతు సురేష్.. రాజన్నదొరను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సాలూరు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఎఎంసి మాజీ చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి మక్కువ మండల అధ్యక్షులు మావుడి రంగు నాయుడు, జెడ్‌పిటిసి మావుడి వాసు నాయుడు, పాచిపెంట ఎంపిపి బడ్నాన ప్రమీల, సీనియర్ నాయకులు పి.వీరన్నాయుడు, డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి సలాది అప్పలనాయుడు, ఎంపిటిసి దండి ఏడుకొండలు, మెంటాడ మండల నాయకులు ఈశ్వరరావు, మధు శుభాకాంక్షలు తెలిపారు.



రాజన్నదొరకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైసిపి నాయకులు

విద్యార్థులకు ఖగోళశాస్త్రంపై వివరణ

డెంకాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు ఖగోళ శాస్త్రం పై వివరించారు. విశ్వంలో సౌర కుటుంబం, పాలపుంత, గెలాక్సీ గురించి, సూర్యుడు ఒక నక్షత్రం అని, స్వయం ప్రకాశం శక్తిని కలిగి వుంటుందని, గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉంటాయని ఖగోళ శాస్త్రం ఉపాధ్యాయులు వివరిం చారు. లైబ్రేరియన్ మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యాక్ర మంలో విద్యార్థులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పుస్తక పఠనం, యోగాపై పిల్లలకు శిక్షణ శనివారం శిక్షణ ఇచ్చారు. యోగా విద్యార్థుల మానసిక ఉల్లాశానికి, శారీర దృఢత్వానికి ఉపయోగ పడుతుందని హైస్కూల్ టీచర్ కె.విశ్వ అన్నారు. పిల్లలచే పద్మాసనం, భుజంగాసనం, సూర్య నమస్కారాలు నేర్పించారు. శాఖా గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకే స్ప్రేయింగ్



స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న డిఎంఒ జగన్‌మోహనరావు

ప్రజాశక్తి-కొమరాడ

దోమల నివారణకు ఎసిఎం ద్రావణాన్ని ఇంటింటికీ పిచికారీ చేయిస్తున్నామని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు వెల్లడించారు. ఈ మేరకు మండలంలోని పెదఖేర్జలలో చేపడుతున్న మొదటి విడత స్ప్రేయింగ్ (ఐఆర్ఎస్) కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ప్రతి ఇంటిలో ఏ మేరకు దోమల మందు పిచికారీ చేస్తున్నారు, స్ప్రే చేస్తున్న తీరు, వినియోగించిన ఎసిఎం ద్రావణం మోతాదును స్వయంగా పరిశీలించారు. గ్రామంలో ఉన్న ఇళ్లన్నింటికీ స్ప్రేయింగ్ పూర్తి చేయాలని ఆయన చెప్పారు. పిచికారీ జరిగినట్లుగా సూచించే మార్కింగ్‌ను తప్పనిసరిగా ఇంటికి వేయాలన్నారు. ప్రజలు సహకరించి వినియోగించుకోవాలని, తద్వారా దోమల వ్యాప్తి తగ్గి జ్వరాలు ప్రబలకుండా ఉంటాయని తెలియజేశారు. స్థానిక గిరిజన సంక్షేమ వసతిగృహంలో స్ప్రేయింగ్‌ను పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న గదులు, టాయిలెట్ గదులకు పిచికారీ పూర్తి చేశారన్నారు.

డిఎంఒ జగన్‌మోహనరావు

మండలంలో 43 మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత స్ప్రేయింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. శనివారం చేపట్టిన 5 గ్రామాలతో కలిపి ఇప్పటికి 38 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.అరుణ్ కుమార్, సబ్ యూనిట్ అధికారి దనుంజయరావు, పంచాయతీ కార్యదర్శి వెంకట రమణ, పిహెచ్ఎన్ విజయకుమారి, ఇఒ సత్తిబాబు, వైద్య సిబ్బంది మంగమ్మ, రమేష్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కిమ్మిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామంలో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం రాజేశ్వరి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేయకపోతే పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు అన్నారు. సిఐటియు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒకపక్క ఎండలు తీవ్రత మరోపక్క విద్యుత్ కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో లోవోల్టేజ్ సమస్యతో విలువైన ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోవడంతో ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్న ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడం అన్యాయమన్నారు. విద్యుత్ కోతలను నివారించి నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలను నివారించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే విద్యుత్ శాఖ ఇఇ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి

ప్రజాశక్తి- రేగిడి



మాధవరావు మృతదేహం

సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన లైన్‌మేన్ బూరాడ మాధవరావు (30) శనివారం విద్యుదాఘాతంతో అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడు అదే మండలం మోదుగులపేట సచివాలయంలో జూనియర్ లైన్‌మేన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం గాలివానకు గ్రామంలో ఓ పంట పొలంలో విద్యుత్ వైర్ తెగిపడింది. విద్యుత్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు శనివారం విద్యుత్ వైర్లు సరిచేసే దిశగా అటుగా వెళ్లిన మాధవరావు వైరు సరిచేసే క్రమంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పంట పొలాలకు వెళ్లిన రైతు కూలీలు మృతి చెందిన మాధవరావును చూసి గ్రామానికి సమాచారం అందించారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవపంచినామ నిర్వహించి, రాజాం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిరిపురంలో విషాదఛాయలు

మోదుగుల పేటలో సచివాలయం ఉద్యోగుగా పనిచేసిన బూరాడ మాధవరావు విద్యుదాఘాతంతో మృతి చెందడం సిరిపురం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పేదరికం నుంచి ఉద్యోగం సంపాదించి కుటుంబాన్ని ఆదుకుంటాడని అనుకున్న తరుణంలో విధి వెక్కిరించి ఆ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసిందని రోదిస్తున్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

పెళ్లి సంబంధం చూస్తున్న తరుణంలో..

మాధవరావుకు పెళ్లి సంబంధం చూశాం. మూలం కావడంతో ఆగస్టు నెలలో జావాం సంబంధం చేసుకుందామని అనుకున్న తరుణంలో ఇలా విద్యుదాఘాతంతో మృత్యువాత పడడటంతో కుటుంబ సభ్యుల రోధన అంతా ఇంతా కాదు

షార్ట్ సర్క్యూట్‌తో బట్టల షాప్ దగ్ధం

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలో పెదమార్కెట్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో బట్టల షాప్ దగ్ధమైంది. షాపులోని సుమారు రూ.5 లక్షల విలువైన బట్టలు కాలిపోయాయి. షాపులోని ఫర్నీచర్, విద్యుత్ పరికరాలు కాలిపోయినట్లు యజమాని రాబర్ట్ అలివేలు చెప్పారు.